గోదావరి @ 27 అడుగులు

భద్రాచలం, జూలై 19 : ఎగువన ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి వరద నీటిమట్టం పెరుగుతోంది. గురువారం రాత్రి 7 గంటలకు 18.2 అడుగులు ఉన్న గోదావరి క్రమక్రమంగా పెరుగుతూ శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు 26.3 అడుగులకు చేరింది. శుక్రవారం రాత్రి 7 గంటలకు 27.1 అడుగుల మేర ప్రవహిస్తోంది. నదీ పరీవాహక ప్రాంతాలతోపాటు ఎగువ రాష్ట్రాల్లో కూడా వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో వరద మరింతగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పట్టణంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శివారు కాలనీలు బురదమయమయ్యాయి.

అధికారుల నిర్లక్ష్యంతోనే తెగిన పెదవాగు కట్ట

సీపీఎం రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్‌రావు

తెగిపోయిన పెదవాగు ప్రాజెక్టు కట్టను పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర నాయకులు

అశ్వారావుపేట టౌన్, జూలై 19 : అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతోనే పెదవాగు ప్రాజెక్టు కట్ట తెగిపోయిందని, దీనికి వారే బాధ్యత వహించాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. వరదలతో గుమ్మడివల్లి గ్రామంలో తెగిపోయిన పెదవాగు ప్రాజెక్టు కట్టను శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. అక్కడి ప్రజలను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెదవాగు ప్రాజెక్టు రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో ఉండడంతో రెండు ప్రభుత్వాలు, ఇక్కడి అధికారులు నిధులు కేటాయించడం.. మరమ్మతు పనులు చేయించడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. నిర్వహణ లేమితోనే ప్రాజెక్టు గేట్లు పని చేయక ప్రమాదం ఏర్పడిందన్నారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం ఏర్పాటు చేసి ప్రాజెక్టు పనులను పునరుద్ధరించాలని, నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు పుల్లయ్య, చిరంజీవి, ముదిగొండ రాంబాబు, ఆల నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జూలై 19 : స్వయం ఉపాధి పథకాల ద్వారా ఆదివాసీ గిరిజన మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఐటీడీఏ పీవో బీ.రాహుల్ అన్నారు. పట్టణంలోని గిరిజన భవన్‌లో ట్రైఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ కళాకృతుల స్టాళ్లను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించిన కళాకృతులు భద్రాచలానికి ఎవరైనా వీఐపీలు వచ్చినప్పుడే బహుమతిగా ఇస్తున్నామని, అలా కాకుండా వీరు తయారు చేసిన ప్రతి వస్తువు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా మార్కెటింగ్ చేస్తే ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు. గిరిజనులు తయారు చేసిన వస్తువులను ట్రైఫెడ్ సంస్థ వారు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, ట్రైఫెడ్ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ , విశ్వ సురేష్‌బాబు, జీసీసీ డీఎం దావూద్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులు తయారు చేసి వస్తువులను పరిశీలిస్తున్న పీవో రాహుల్

కంప్యూటర్ సైన్స్‌కే 'జై'

- పూర్తయిన ఎప్‌సెట్ సీట్ల కేటాయింపు ప్రక్రియ
- ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్‌పై ఆసక్తి చూపని విద్యార్థులు
- సెల్ఫ్ రిపోర్ట్‌కి 23 వరకు చాన్స్

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 19 : ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరేందుకు నిర్వహించిన ఎప్‌సెట్-2024 కౌన్సిలింగ్ సీట్ల అలాట్‌మెంట్‌ను శుక్రవారం ప్రకటించారు. విద్యార్థులకు ఏయే కళాశాలల్లో ఏయే కోర్సుల్లో సీటు కేటాయించారో నేరుగా సంక్షిప్త సమాచారంతోపాటు ఆయా కళాశాలలకు సమాచారం చేరవేశారు. WWW.TGEAPCET.NIC.IN వెబ్‌సైట్‌లో సీటు అలాట్‌మెంట్ వివరాలు పొందుపర్చారు. జేఎన్‌టీయూహెచ్ పరిధిలో జిల్లాలో ఎనిమిది ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలతోపాటు జేఎన్‌టీయూ పాలేరు ప్రభుత్వ కళాశాలలో ఎప్‌సెట్ ద్వారా ప్రవేశాలు కల్పించారు. సీట్ల కేటాయింపులో అత్యధిక కళాశాలల్లో కొన్ని బ్రాంచ్‌ల్లో సీట్లు భర్తీ కాలేదు. విద్యార్థికి కేటాయించిన కళాశాలలో ఈ నెల 23 లోగా సెల్ఫ్ రిపోర్ట్ చేయాలని, ఈ నెల 27 నుంచి రెండో విడత కౌన్సిలింగ్ ప్రారంభం కానున్నది.

సగం సీట్లు కూడా నిండలే..

ఇంజినీరింగ్‌కి గతంలో ఉన్న క్రేజ్ నాలుగైదేళ్ల నుంచి తగ్గుతూ రాగా.. ఈ విద్యాసంవత్సరం మాత్రం కొంత ఆశాజనకంగానే సీట్లు భర్తీ అయ్యాయి. ఖమ్మం జిల్లాలో 8 ప్రైవేట్, ఒక ప్రభుత్వ కళాశాల అందుబాటులో ఉండగా.. 2,500 సీట్లు వివిధ కోర్సుల్లో ఉన్నాయి. అత్యధికంగా కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్‌లోనే 95 శాతంకుపైగా సీట్లు ఉన్నాయి. శుక్రవారం ప్రకటించిన సీట్ల కేటాయింపులో జిల్లాలో కేవలం 1,860 సీట్లు భర్తీ అయినట్లు తెలుస్తోంది. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, కొత్తగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ కోర్సులు జిల్లాలోని కళాశాలల్లో అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్ సైన్స్‌తోపాటు కంప్యూటర్స్ అనుబంధంగా ఉన్న కోర్సులకు ఆదరణ ఎక్కువగా ఉండగా.. ఆ తర్వాత ఎలక్ట్రానిక్స్ కోర్సులను విద్యార్థులు ఎంచుకున్నట్లు సీట్ల భర్తీని బట్టి తెలుస్తోంది.

కంప్యూటర్‌కే క్రేజ్..

ఇంజినీరింగ్ కోర్సుల్లో మొదటి నుంచి కంప్యూటర్ సైన్స్‌తోపాటు వాటికి అనుబంధ కోర్సులకే ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నారు. మధ్యలో ఒకటి రెండేళ్లు మినహా కంప్యూటర్ సైన్స్‌కి క్రేజ్ తగ్గలేదు. ఈ విద్యా సంవత్సరం బీటెక్‌లో సీఎస్ఈ కోర్సుకు విద్యార్థులు తమ మొదటి ప్రాధాన్యత ఇస్తూ జై కొట్టారు. జిల్లాలో అత్యధికంగా కళాశాలల్లో 343, 286, 218, 206, 202, 178, 127, 25 సీట్లు భర్తీ కాగా.. జేఎన్‌టీయూ పాలేరులో 275 సీట్లు భర్తీ అయ్యాయి.

23లోగా సెల్ఫ్ రిపోర్ట్‌కు అవకాశం

ఎప్‌సెట్ మొదటి విడతలో సీటు పొందిన విద్యార్థులు మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 23వ తేదీలోగా సెల్ఫ్ రిపోర్ట్ చేయాలి. కళాశాల నచ్చకపోతే రెండో విడతలో మరోసారి ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చు. మొదటి దశలో రిపోర్ట్ చేయకపోతే రెండో విడతలో సీటు రాకపోతే మొదటి కళాశాలలో ఉన్న సీటు కూడా పోతుంది. ఈ నెల 27 నుంచి రెండో దశ కౌన్సిలింగ్ ప్రారంభం కానున్నది. వెబ్‌సైట్ ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లించడానికి, సెల్ఫ్ రిపోర్టింగ్‌కి అవకాశం కల్పించారు.

ప్రాణనష్టం లేకుండా కాపాడాం

పంట నష్టంపై అంచనాలకు ఆదేశించాం: కలెక్టర్

వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

అశ్వారావుపేట రూరల్, జూలై 19 :పెదవాగు ప్రాజెక్టు వరద ప్రవాహంలో ప్రాణనష్టం జరుగకుండా కాపాడమని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను శుక్రవారం వారు పరిశీలించారు. ఎగువ నుంచి ఆకస్మాత్తుగా ప్రవహం పెరగడం వల్లనే పెదవాగు ప్రాజెక్టుకు వరద పోటెత్తిందని తెలిపారు. ఈ ఘటనలో అధికారుల నిర్లక్ష్యం ఉందని ఇక్కడి ప్రజలు అంటున్నారని, విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండే అధికారులపై చర్యలుంటాయని అన్నారు. పంట నష్టాన్ని అంచనా వేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఇసుక మేటలు, పొలాల్లోకి కొట్టుకొచ్చిన రాళ్లు, పొలాలకు పడిన గండ్లు, కూలిన ఇళ్లు వంటి వివరాలపై నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. ప్రభుత్వం ఆదుకుంటుందని ధైర్యం చెప్పారు. గుమ్మడవల్లి, కొత్తూరు, నారాయణపురం గ్రామాల్లో కూలిన ఇళ్లు, ఇసుక మేటలను కూడా వారు పరిశీలించారు.

విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

మరమ్మతులకు రూ.10 కోట్లతో అంచనాలు : సురేశ్‌కుమార్, ఐబీ ఈఈ

పెదవాగు ప్రాజెక్టుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు సుమారు రూ.10 కోట్ల అంచనా వేస్తున్నట్లు భద్రాద్రి జిల్లా ఐబీ ఈఈ సురేశ్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్టు వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీ నుంచి వరద ఉధృతి పెరగడం వల్లే గండి పడిందని, స్థానిక అధికారుల నిర్లక్ష్యం లేదని అన్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 40 వేల క్యూసెక్కులు కాగా.. ఎగువ నుంచి 80 వేల క్యూసెకుల నీరు వచ్చిందని అన్నారు. వర్షానికి తడవడం వల్ల మోటార్లు పనిచేయలేదన్నారు. ప్రాజెక్టును కాపాడేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు చేశామన్నారు. గురువారం ఉదయం నుంచి రాత్రి ఏకధాటిగా వర్షం కురవడం వల్లనే ప్రాజెక్టుకు గండిపడిందని తెలిపారు. ఇది రెండు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు అని, తిరిగి యథాస్థితికి తీసుకొస్తామని, మరికొన్ని గేట్లు విస్తరించాల్సి ఉందని వివరించారు. ఇందుకు రూ.100 కోట్ల వరకూ ఖర్చవుతుందని తెలిపారు.

గుమ్మడవల్లిలో ఇసుకమేటలు పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన అధికారి, ఏడీఏ

ఖమ్మం తాగునీటికి సాగర్ జలాలు విడుదల

నందికొండ, జూలై 19 : ఖమ్మం జిల్లాలో తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ డ్యామ్ ఎడమ కాల్వకు ఎన్ఎస్‌పీ అధికారులు శుక్రవారం నీటిని విడుదల చేశారు. పాలేరు రిజర్వాయర్ నింపేందుకు తొలిరోజు 500 క్యూసెక్కులతో ప్రారంభించి క్రమంగా పెంచుకుంటూ రోజుకు 4,000 క్యూసెక్కుల చొప్పున 4 రోజులపాటు 1.5 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. నాగార్జునసాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590(512 టీఎంసీలు) అడుగులు కాగా.. ప్రస్తుతం 505.10(123 టీఎంసీలు) అడుగుల్లో నీరుంది. కుడికాల్వ ద్వారా 5,700 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 1,665 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 800 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. మొత్తంగా జలాశయం నుంచి 8,165 క్యూసెక్కుల అవుట్ ఫ్లో కొనసాగుతుండగా.. శ్రీశైలం జల విద్యుత్ కేంద్రాల ద్వారా 8,165 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది.

సీతారామ పంప్‌హౌస్ ట్రయల్ రన్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 19 (నమస్తే తెలంగాణ) : సీతారామ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు ట్రయల్ రన్‌లో భాగంగా శుక్రవారం ఇంజినీరింగ్ అధికారులు రెండో మోటర్‌ను ఆన్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో ఉన్న ఏడు మోటర్లలో మొదటిసారిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల ట్రయల్ రన్ వేయగా రెండో మోటర్‌ను ఇరిగేషన్ అధికారులు బృందం శుక్రవారం ట్రయల్‌రన్ వేశారు. చైనా టెక్నాలజీతో తయారైన ఈ మోటర్ల పనితీరును అధికారులు పరిశీలించారు. ఆగస్టు కల్లా సాగునీరు అందించే కార్యక్రమంలో భాగంగా అధికారులు పనులను వేగవంతం చేస్తున్నారు. మొదటిసారి మోటర్ ద్వారా నీరు కాలువలోకి విడుదల చేసినపుడు పూసుగూడెం పంప్‌హౌస్ వరకు నీరు చేరింది. అక్కడ రెండో స్టేజీ, తర్వాత కమలాపురంలో మూడో స్టేజీలో ఏడు మోటర్లు ఉన్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం కోసం ఈ ట్రయల్ రన్ వేసినట్లు అధికారులు తెలిపారు.

కిన్నెరసాని నుంచి 5వేల క్యూసెక్కులు విడుదల

పాల్వంచ రూరల్, జూలై 19 : కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి శుక్రవారం రాత్రి 5 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు శుక్రవారం 2,800 క్యూసెక్కుల నీరు వచ్చి ప్రాజెక్టులోకి చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా, శుక్రవారం రాత్రి 402.4 అడుగులకు చేరింది. దీంతో ప్రాజెక్టు అధికారులు ఒక గేటు ఎత్తి 5వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. ఎస్పీ రోహిత్‌రాజ్ శుక్రవారం ప్రాజెక్టును సందర్శించి డ్యామ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

దుమ్ముగూడెం వద్ద 12.2 అడుగులకు చేరిన గోదావరి

క్రమంగా పెరుగుతున్న గోదావరి

దుమ్ముగూడెం, జూలై 19 : దుమ్ముగూడెం హెడ్ లాక్‌ల వద్ద శుక్రవారం సాయంత్రం గోదావరి వరద నీటిమట్టం 12.2 అడుగులకు చేరింది. రెండు రోజులుగా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో వరద తీవ్రత క్రమక్రమంగా పెరుగుతోంది. రాత్రికి 15 అడుగులకు చేరుకుంటుందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. దుమ్ముగూడెం గ్రామంలో ఉన్న తూములోకి వరద నీరు వెళ్లకుండా ఇరిగేషన్ అధికారులు అడ్డుగా ఇసుక బస్తాలు వేస్తున్నారు. కార్యక్రమంలో ఏఈ రాజ్ స్వరాజ్, పీటీ మస్తాన్ వలీ బేగ్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో నాబార్డ్ కీలక పాత్ర

- తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతల

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో నాబార్డ్ కీలకపాత్ర పోషించిందని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్) తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ చింతల సుశీల అన్నారు. 43వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పథకాలలో నాబార్డ్ భాగస్వామ్యం కావడం గర్వకారణంగా ఉందన్నారు. నాబార్డు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే రైతులకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించడంతోపాటు ఇంక్యూబేషన్ సెంటర్‌లతో స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి పలు చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక, ప్రణాళికాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు మాట్లాడుతూ..నాబార్డు ప్రోత్సాహంతో పంటలపైన కాకుండా వ్యవసాయ అనుబంధ రంగాలైన పాల ఉత్పత్తులు, పౌల్ట్రీ, ఫిషరీస్ తదితర రంగాలద్వారా కూడా ఆదాయం గణనీయంగా పెరుగుతున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి తలసరి ఆదాయంలో 10వ స్థానంలో ఉన్న రాష్ట్రం, ప్రస్తుతం మూడో స్థానానికి ఎగబాకిందన్నారు. ఈ సందర్భంగా టీఎస్ఆర్‌టీసీ అధ్యక్షుడు ఎం రవీందర్ రావు మాట్లాడుతూ.. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నాబార్డ్ గ్రాస్ రూట్ స్థాయిలో వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

కార్పొరేట్లకు ఆ చాన్స్ ఇవ్వం

బ్యాంక్ ప్రమోటర్లుగా అనుమతిపై ఆర్బీ ఐ గవర్నర్ దాస్

ముంబై, జూలై 19: బ్యాంకుల ప్రమోటర్లుగా కార్పొరేట్లను అనుమతించే యోచనేదీ ప్రస్తుతానికి లేదని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. శుక్రవారం ఇక్కడ ఓ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో దాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిగిన ప్రశ్నకే పైవిధంగా బదులిచ్చారు. వ్యాపార సంస్థలు బ్యాంకులను ఏర్పాటుచేస్తే బ్యాంకింగ్ ప్రయోజనాలు దెబ్బతింటాయన్నారు. నిజానికి దశాబ్దకాలం కిందట బ్యాంకులకు లైసెన్సులిచ్చినప్పుడు కార్పొరేట్ల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. అయినప్పటికీ వారందరి దరఖాస్తులను ఆర్బీఐ తిరస్కరించింది. 2020లోనూ ఈ అంశం మళ్లీ తెరపైకి రాగా.. బ్యాంకులు అంటే ఇతర వ్యాపారాల మాదిరి కాదని ఆర్బీఐ తేల్చిచెప్పింది.

డిపాజిట్లు తగ్గితే ఇబ్బందే

రుణాల కంటే డిపాజిట్ల వృద్ధి తక్కువగా ఉంటే.. నిర్మాణాత్మక ద్రవ్యపరమైన సమస్యలు వస్తాయని దాస్ అన్నారు. వ్యక్తిగత రుణాల వంటి అన్‌సెక్యూర్డ్ లోన్లు పెరుగుతూ పోతుండటంపైనా ఆయన ఒకింత ఆందోళన వ్యక్తం చేశారు. రుణ, డిపాజిట్ల వృద్ధి మధ్య సహేతుకమైన సమతూకాన్ని పాటించాలని బ్యాంకులకు సూచించారు. డిపాజిట్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలని హితవు పలికారు.

ద్రవ్యోల్బణంపై..

ద్రవ్యోల్బణంపై ఆర్బీఐ అనుసరించే ద్రవ్యవిధానం స్పష్టంగా ఉందని దాస్ చెప్పారు. గతకొంత కాలంగా వడ్డీరేట్లు గరిష్ఠ స్థాయిల్లోనే ఉంటుండటంపై స్పందిస్తూ.. అధిక వడ్డీరేట్లు దేశ జీడీపీ ప్రగతికి విఘాతం కలిగించడం లేదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లోనూ వృద్ధిరేటు 7.2 శాతంగా ఉంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అయితే ఆర్బీఐ ద్రవ్యసమీక్షల్లో కీలక వడ్డీరేట్లను తగ్గించాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్న మానిటరీ పాలసీ కమిటీ సభ్యుల సంఖ్య పెరుగుతుండటం గమనార్హం.

ఛీర్‌లీడర్ కాదు..

తన హయాంలో కేంద్ర ప్రభుత్వానికి ఆర్బీఐని ఓ ఛీర్‌లీడర్‌గా ఎవరూ భావించలేదని దాస్ చెప్పారు. ఆ రకమైన భావన తనకు ఎప్పుడూ ఎదురు కాలేదన్నారు. ఈ క్రమంలోనే దేశ ఆర్థిక వ్యవస్థ కరోనా మహమ్మారి సృష్టించిన విధ్వంసం నుంచి త్వరగా బయటపడటానికి కేంద్ర ప్రభుత్వంతో ఆర్బీఐకి ఉన్న చక్కని సమన్వయం దోహదం చేసిందని తెలిపారు. దాదాపు ఆరేండ్ల తన పదవీకాలంలో ప్రభుత్వంతో సత్సంబంధాలనే నిర్వహించినట్టు వెల్లడించారు. కాగా, పలు కీలక అంశాల్లో కేంద్రంతో ఏర్పడిన విబేధాల కారణంగా ఊర్జిత్ పటేల్ అనూహ్య రాజీనామాతో ఆర్బీఐ గవర్నర్‌గా దాస్‌ను మోదీ సర్కారు తెచ్చిన విషయం తెలిసిందే. అప్పట్నుంచి కేంద్రం చెప్పినదానికి ఆర్బీఐ ఊ కొడుతున్నదన్న విమర్శలు వ్యక్తమవుతున్న సంగతి విదితమే. పెద్ద ఎత్తున డివిడెండ్లనూ ఇస్తున్నది చూస్తూనే ఉన్నాం.

స్టాక్ మార్కెట్లకు మైక్రోసాఫ్ట్ దెబ్బ

ముంబై, జూలై 19: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస లాభాలకు శుక్రవారం బ్రేక్ పడింది. రికార్డు స్థాయి గరిష్ఠాల్లో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. మరోవైపు మైక్రోసాఫ్ట్‌లో సాంకేతిక సమస్య అంతర్జాతీయ మార్కెట్లను కుదిపేసింది. ఈ పరిణామం భారతీయ మార్కెట్ల నష్టాలను మరింత పెంచింది. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 738.81 పాయింట్లు లేదా 0.91 శాతం పడిపోయి 81 వేల మార్కుకు దిగువన 80,604.65 వద్ద ముగిసింది. నిజానికి తీవ్ర ఒడిదొడుకుల్లోనే ట్రేడింగ్ సాగింది. ఒకానొక దశలో గురువారం ముగింపుతో చూస్తే 244 పాయింట్లకుపైగా ఎగిసి ఆల్‌టైమ్ హైని తాకుతూ 81,587.76 వద్దకు సూచీ వెళ్లింది. అయితే ఈ ఉత్సాహం ఎంతోసేపు నిలబడలేకపోయింది. ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడిలోకి జారుకోవడంతో 844.36 పాయింట్ల నష్టాన్ని సెన్సెక్స్ మూటగట్టుకోవడం గమనార్హం. చివరకు కొంతమేర కోలుకున్నా.. నష్టతీవ్రత ఎక్కువగానే ఉన్నది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 269.95 పాయింట్లు లేదా 1.09 శాతం దిగజారి 24,530.90 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలో మునుపెన్నడూ లేనివిధంగా 24,854.80 స్థాయికి చేరినా.. నిలదొక్కుకోలేకపోయింది. ఈ నేపథ్యంలోనే 292.7 పాయింట్ల మేర నష్టపోయింది. అయితే ఆఖర్లో కాస్త కోలుకున్నది. అంతకుముందు 4 రోజుల పాటు స్టాక్ మార్కెట్లు లాభాల్లోనే కదలాడిన విషయం తెలిసిందే. సెన్సెక్స్ 1,446.12 పాయింట్లు లేదా 1.80 శాతం పుంజుకున్నది.

8 లక్షల కోట్ల సంపద ఆవిరి

స్టాక్ మార్కెట్ల నష్టాల నేపథ్యంలో మదుపరుల సంపద ఈ ఒక్కరోజే లక్షల కోట్ల రూపాయల్లో హరించుకుపోయింది. బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.8 లక్షల కోట్లదాకా ఆవిరైపోయింది. రూ.7,94,059. 53 కోట్లు క్షీణించి రూ.4,46,38,826.75 కోట్ల (5.34 ట్రిలియన్ డాలర్లు)కు పరిమితమైంది. వరుస లాభాల మధ్య మదుపరుల సంపద రూ.455 లక్షల కోట్లనూ తాకిన సంగతి విదితమే.

రంగాలవారీగా..

మెటల్ రంగ షేర్లు అత్యధికంగా 4.11 శాతం పడిపోయాయి. కమోడిటీస్ 3.07 శాతం, చమురు-గ్యాస్ 2.87 శాతం, విద్యుత్తు 2.67 శాతం, ఆటో 2.53 శాతం, యుటిలిటీస్ 2.51 శాతం, రియల్టీ 2.44 శాతం, సేవలు 2.42 శాతం చొప్పున నష్టపోయాయి. టాటా స్టీల్ షేర్ విలువ 5 శాతానికిపైగా దిగజారింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా మోటర్స్, ఎన్టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లూ మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి.

గ్లోబల్ మార్కెట్లలో..

మైక్రోసాఫ్ట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య.. అన్ని రంగాలనూ ప్రభావితం చేసింది. దీంతో ఆయా దేశాల స్టాక్ మార్కెట్లపైనా ఈ ప్రభావం కనిపించింది. ఆసియా దేశాల్లో ప్రధానంగా దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు నష్టాలను చవిచూశాయి. చైనా సూచీ లాభపడింది. అలాగే కీలక ఐరోపా మార్కెట్లలో ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ సూచీలూ నష్టపోయాయి. గురువారం నష్టాల్లో ముగిసిన అమెరికా మార్కెట్లూ.. శుక్రవారం తీవ్ర ఒడిదొడుకుల్లో ట్రేడ్ అయ్యాయి. మైక్రోసాఫ్ట్ దెబ్బకు విమానయాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బ్యాంకింగ్, మీడియా రంగాల్లోనూ ఇబ్బందులు తలెత్తాయి. కాగా, భారతీయ స్టాక్ మార్కెట్లపై సాంకేతికంగా మైక్రోసాఫ్ట్ ప్రభావం లేదని బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు ప్రకటించాయి.

రిలయన్స్‌కు చమురు సెగ

- క్యూ1లో 5 శాతం తగ్గిన నికర లాభం

న్యూఢిల్లీ, జూలై 19: దేశంలో అత్యంత విలువైన సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ లాభాలకు చమురు సెగ గట్టిగానేతాకింది. రిఫైనింగ్ మార్జిన్లు తక్కువగా ఉండటంతోపాటు పెట్రోకెమికల్ మార్జిన్లు తగ్గడంతో ఆర్థిక ఫలితాలపై ప్రభావం చూపింది. టెలికం, రిటైల్ రంగాలు రాణించినప్పటికీ మిగతా రంగాలు నిరాశాజనక పనితీరు కనబరిచాయి. దీంతో గడిచిన త్రైమాసికానికిగాను కంపెనీ రూ. 15,138 కోట్లు(ప్రతి షేరుకు రూ. 22.37) కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది వచ్చిన రూ. 16,011 కోట్లు(ప్రతిషేరుకు రూ.23.66) పోలిస్తే 5 శాతం తగ్గింది. జనవరి-మార్చి త్రైమాసికంలో నమోదైన రూ.18,951 కోట్ల లాభంతో పోలిస్తే 20 శాతం తగ్గింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.2.31 లక్షల కోట్ల నుంచి రూ.2.57 లక్షల కోట్లకు ఎగబాకింది.

*చమురు, గ్యాస్ వ్యాపారాలు బలహీనంగా ఉన్నప్పటికీ కన్జ్యూమర్ విభాగాలు రాణించాయి. డిజిటల్ సర్వీసెస్, రిటైల్ రంగాలకు కస్టమర్ల నుంచి ఆశించిన స్థాయిలో కంటే అధికంగా మద్దతు ఉండటంతో ఈ వి